మూడేళ్లు పూర్తయిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలి

మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం: మూడేళ్లు పూర్తయిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ భారతి అన్నారు. బుధవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అలాగే వాల్మీకిపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలని తెలిపారు. నాలుగు రకాల పిపి1, పిపి2 పుస్తకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించారు. స్థానిక గాంధీబస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి అంగన్‌వాడీకి రండి.. పౌష్టికాహారం పొందండి, అంగన్‌వాడీ ముద్దు.. కాన్వెంట్ వద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రోహిణి కుమారి, భానులక్ష్మి, రాణి, మహాలక్ష్మి, సర్తాజ్ బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో నిర్వేదమే!



- నెరవేరని సిఎం హామీలు..నిరాశలో ప్రజానీకం
- ప్రశ్నార్థకంగా రాజంపేట, ప్రొద్దుటూరు మెడికల్ కళాశాలలు
- కదలని వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులు
- సెయిల్ ఆధ్వర్యంలో 'ఉక్కు' ఏర్పాటులో వైఫల్యం
- కూటమి ఏడాది పాలనపై ఫోకస్...

జిల్లాలో కూటమి సర్కారు ఏడాది పాలనలో నిర్వేదం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసిన నేపథ్యంలో కూటమి నాయకునిగా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన తొమ్మిది రకాల హామీలు అమలుకు నోచుకోని నేపథ్యం నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు జీవనాడిగా పేరుగాంచిన సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ రాబట్టడంలో వైఫల్యం దగ్గర నుంచి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. 2024 జూన్ 12న రాష్ట్రంలో కూటమి పాలన మొదలై ఏడాది గడుస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై ఓ అవలోకనం..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కూటమి ఏడాది పాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. పాలనలో ఎటువంటి పురోగతి లేకపోగా తిరోగమనంలో నడుస్తోంది. కొప్పర్తి నుంచి ఎంఎస్ఎంఇ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించడం, ఎస్ఎస్‌డిపి కోర్టును తిరుపతికి తరలించడం, మదనపల్లి, పులివెందుల మెడికల్ కళాశాలలు ప్రారంభించడంలో విఫలం కావడం వంటి కార్యకలాపాలతో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన సుమారు తొమ్మిది రకాల ప్రధాన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కడప, రాయచోటి పట్టణాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా కడప జిజిహెచ్ ఆస్పత్రిని జాతీయ వైద్య విజ్ఞాన సంస్థగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చారు. ఏడాది గడిచినప్పటికీ సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ ఆస్పత్రులకు ప్రొఫెసర్స్ దగ్గర నుంచి అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ సిబ్బంది, నర్సుల నియామకాలకు దిక్కు లేకుండా పోయింది. ప్రొద్దుటూరు, రాజంపేట ప్రాంతాల్లో మెడికల్ కళాశాలలు, రాయచోటిలో ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీ ప్రస్తావనే మరిచిపోయారు. వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ జిల్లా వాసి అయినప్పటికీ అటువంటి స్పృహే కలగక పోవడం శోచనీయం. రాయచోటి, రాజంపేట పట్టణాల్లో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఎటువంటి వైఖరికి దారి తీస్తుందోనని ఆందోళన నెలకొంది. అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి మండిపల్లి ఇలాఖాలోని చిన్నమండెంలో జూనియర్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాలల ఏర్పాటు చేస్తామని హామీలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన రిజర్వాయర్ల పెండింగ్ పనుల్ని పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ప్రశ్నార్థకంగా మారింది. రాయలసీమ జిల్లాలకు చదువు, నీళ్లు, మౌలిక వసతులు కల్పిస్తే రాయలసీమ కోనసీమగా మారుస్తామని, రాయలసీమను హార్టీ కల్చరల్ హబ్‌గానూ, ఫ్రూట్‌బాస్కెట్‌గా మారుస్తామనే హామీలు జిల్లా ప్రజల చెవుల్లో మార్మోగుతున్న సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీల్లో కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం ఒకటి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు ఫీజుబులిటీ పేరుతో దగా చేస్తూ వస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని సంకీర్ణ సర్కారు రాష్ట్రంలోని టిడిపి, జనసేన ఎంపీల మద్దతుపై ఆధారపడి మనుగడ సాగిస్తోంది. టిడిపి, జనసేన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి సెయిల్ ఆధ్వర్యంలో జిల్లాకు ఉక్కు పరిశ్రమను రాబట్టు కోవడంలో ఉద్దేశపూర్వకంగానే విఫలమైంది. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రాన్ని ప్రశ్నించిన, నిలదీసిన పాపానికిపోని పరిస్థితి దాపురించడం దుర్మార్గం. ప్రయివేటు ఉక్కు కంపెనీలకు లాభసాటి అయినప్పుడు సెయిల్‌కు ఎందుకు లాభసాటి, ఫీజుబులిటీ కాదో నిలదీయాల్సిన అవసరం ఉంది. కనీస ప్రయత్నం చేయకుండా జెఎస్‌డబ్ల్యూ అనే ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో సాగుతున్న ఉక్కు పరిశ్రమ పనులు ఏడాదిపాటు నిలిచిపోవడం ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగిస్తోంది. కడపలో నిర్వహించిన మహానాడు బహిరంగసభలో జూన్ 12న ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని, 3,500 మందికి ఉపాధి లభిస్తుందని ప్రకటించి చేతులు దులుపుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. అమ్మఒడి, రైతుభరోసా ఆన్‌గోయింగ్ సంక్షేమ పథకాల పేర్లు మార్పునకు పరిమితం కావడం తీవ్ర విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుండడం తీవ్రమైన విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

ప్రేమోన్మాది వేధింపులకు విద్యార్థిని బలి!

- తండ్రినీ చంపుతానంటూ బెదిరింపు
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు

సృజన (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-రాయచోటి

ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక సృజన (16) విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టావాండ్లపల్లెలో చోటుచేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు వివరాల్లోకి వెళితే... రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మిట్టవాండ్లపల్లికి చెందిన చంద్రగిరి ఉత్తయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె సృజన ఇటీవల పదవ తరగతిలో 554 మార్కులు సాధించింది. ఈ క్రమంలో తండ్రి ఉత్తయ్య ఉత్తమ మార్కులు సాధించిన తన కుమార్తెకు పట్టణంలోని రాజు ఐఐటి కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాం తంలో సృజన ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లడంతో తండ్రి ఏం జరిగిందని విచారిం చగా తారకరత్న నిన్ను చంపేస్తాడంట నాకు భయంగా ఉంది నాన్న అని తండ్రికి చెప్పింది. ఎందుకు చంపుతాడంట ఏమి జరిగింది చెప్పమని కూతురిని అడగగా నెల రోజులుగా తారకరత్న ప్రేమ పేరుతో తనను వెంటబడి వేధిస్తున్నాడని ప్రేమించకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడని నా వెంట పడద్దని ఇంట్లో వాళ్లకు చెబితే గొడవ అవుతుందని హెచ్చరిస్తే అందుకు తారకరత్న మీ నాన్నను కూడా చంపుతానని బెదిరించాడని ఫిర్యాదులో వివరించాడు. ఈ విషయం బయటకు చెబితే చదువుకునే పాపకు ఇబ్బంది అవుతుందని సృజన తల్లిదండ్రులు విషయాన్ని నేరుగా తారకరత్న తల్లిదండ్రులకు చెప్పి సమస్య పరిష్కరిం చుకుందామని అనుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిల్ల లంతా ఆడుకుంటుండగా నా కుమార్తె సృజన ఇంట్లోకి హడావిడిగా వచ్చి తారకరత్న ఫొటోలు బయట పెడతాడంట నాకు భయమేస్తుందని చెప్పి హాల్ రూమ్‌లోకి పోయి గడియ పెట్టుకున్నదని తెలిపారు. భయపడి కుటుంబ సభ్యులు అంతా కలిసి గడియ తీయమని ఎంత చెప్పినా మా పాప గడియ తీయలేదని, అంతట తాము తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్ కొక్కికి ఉయ్యాల కోసం లాగి ఉన్న చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉండిందని వివరించారు. వెంటనే నా కుమార్తెను కిందకు దించే చికిత్స కోసం ఆటోలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు. డాక్టర్ పరీక్షించి అప్పటికే సృజన చనిపోయిందని చెప్పాడన్నారు. ప్రేమ పేరుతో వేధించి లొంగలేదనే కారణంతో ఫొటోలు బయట పెడతానని భయపెట్టి నా కూతురు చావుకు కారణమైన తారకరత్నపై చట్టపరమైన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని చంద్రగిరి ఉత్తయ్య ఫిర్యాదులో పోలీసులను వేడుకున్నారు. సృజన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సిఐ బి.వి.చలపతి తెలిపారు.

సెలవులకు టాటా.. ఇక బడిబాట..!

మోగనున్న బడిగంట
నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
స్టూడెంట్ కిట్లు సిద్ధం

ప్రజాశక్తి-రాయచోటి

పాఠశాలలకు సెలవులు నిన్నటితో ముగిశాయి. నేడు గురువారం పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా పునఃప్రా రంభమ వుతున్నాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హైస్కూళ్లు 303, ప్రైమరీ స్కూళ్లు 1,734, యూపి స్కూళు 152, మొత్తం 2,199 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో బాలికలు 74,572, బాలురు 68,028 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,42,600 మంది విద్యార్థులున్నారు. ప్రయివేట్ పాఠశాలలు 574 ఉన్నాయి. ప్రభుత్వ కొన్ని పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. నేటి నుంచి అడ్మిషన్లు కూడా ప్రారంభమవుతున్నాయి. గత ప్రభుత్వంలో మొదటి విడతలో నాడు - నేడు పనులు 963 మంజూరు కాగా అవి పూర్తయ్యాయి. రెండవ విడతలో 766 మంజూరయ్యాయి. వాటిలో ఇంకా మరమ్మతులు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాయచోటి మండలంలోని గరుగుపల్లిలో ప్రభుత్వ పాఠశాల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గాలివీడు మండలంలోని చీమల చెరువుపల్లిలో రెండువ విడతలో నాడు - నేడు పనులు మంజూరుకావడంతో ఉన్న పాఠశాలను పడగొట్టారు. దీంతో విద్యార్థులను అంగన్వాడీ కేంద్రంలోకి మార్చారు. అక్కడ స్థలం సరిపోక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల నిర్మాణ పనులు కూడా నత్తనాడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో నాడు- నేడు క్రింద పాఠశాల మరమ్మతులు, మరుగుదొడ్లకు నిధులు కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికీ ఏడాది పూర్తయింది. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలకు ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదు.

స్టూడెంట్ కిట్లు సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా స్టూడెంట్ కిట్లుగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు, బూట్లు 100 శాతం వరకు జిల్లాకు వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలి

నేడు పాఠశాలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా గతంలో పెండింగ్‌లో ఉన్నటువంటి భవనాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, వాటిని పూర్తి చేయించడంలో పూర్తిగా వెనుకబడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కొద్దిమేరకైనా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముంది. కెజిబివి, ఎపి ఆర్‌జెసి, అంబేద్కర్ గురుకులాలు, జ్యోతిరావు పూలే గురుకులాలు అన్నిట్లో కూడా సమస్యలతో పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు విద్యను అభ్యసించడం ఎలా సాధ్యమవుతుందో అధికారులే చెప్పారు. అలాంటి వాటిపైన ప్రత్యేకంగా కమిటీలు వేసి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలి.

ఆగిన భవనాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నూతన ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలి. మధ్యలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్టూడెంట్ కిట్లను 100 శాతం ఇవ్వాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యత పెంచి సన్నబియ్యాన్ని సరఫరా చేయాలి.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, అన్నమయ్య జిల్లా.

పాఠశాలల్లో వసతులు పూర్తి చేశాం

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేశాం. పాఠ్య పుస్తకాలు మండలాలకు అందజేశాం. ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసు కుంటున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. సిబ్బంది కొరత ఉండటం వల్ల విద్యా శాఖలో జరిగే కార్యక్రమాలను పాత్రికేయులకు ఇవ్వలేకపోయాం. ఈ ఏడాదిలో అలాంటిది జరగకుండా చూసుకుంటాం.

- సుబ్రహ్మణ్యం, డిఇఒ, అన్నమయ్య జిల్లా.

కొప్పర్తికే ఎంఎస్ఎంఇ!

- కార్పొరేషన్ పేరిట రిజిస్ట్రేషన్ పూర్తి
- రూ.50 కోట్లతో భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఇ పార్క్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు మంగళవారం ఎంఎస్ఎంఇ పార్క్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి చెందిన ఉన్నతాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.202 కోట్ల వ్యయంతో కూడిన ఎంఎస్ఎంఇ పార్కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయింది. దీంతో 2024 సెప్టెంబర్‌లో కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎంఎస్ఎంఇ పార్క్‌ను తరలిస్తూ కూటమి సర్కారు జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఒకవైపు జిల్లా వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ తరలింపునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం కావడం, మరోవైపు కేంద్రం ఎంఎస్ఎంఇ తరలింపును అంగీకరించకపోవడంతో ఎంఎస్ఎంఇ తరలింపు ఆగిపోయింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కూటమి సర్కారు కొప్పర్తిలోని 19.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో కూడిన ఎం ఎస్ఎంఇ పార్కు తరలింపు ఉపసంహరించుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా రిజిస్ట్రేషన్ పూర్తి కావడంతో రూ.50 కోట్లతో కూడిన భవన నిర్మాణాలు, ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని పెంచే పరికరాల ఏర్పాటు తదితర సదుపాయాల కల్పన ఊపందుకోనుంది. దీంతో రాయలసీమ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం లభించనుంది. వీరితోపాటు ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదివిన లక్షలాది మంది ఇంజినీరింగ్ యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. వీరికి ఎంఎస్ ఎంఇ పార్కులో పారి శ్రామిక అవసరాలకు తగిన విధంగా సాంకేతిక విద్యలోని ఆధునిక శిక్షణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా రాయల సీమలోని లక్షలాది మంది యువతకు ఉపాధికి భరోసా లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సంపర్క్‌క్రాంతి రైలు నిలుపుదల హర్షణీయం

- రవాణా శాఖ మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ప్రజల సౌకర్యమే మాకు ముఖ్యమని, అందుకోసం నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తామని, సంపర్క్ క్రాంతి రైలు రాజంపేటలో నిలుపుదల హర్షణీయమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజంపేట రైల్వేస్టేషన్‌లో మంత్రి చేతుల మీదుగా తిరుపతి-న్యూఢిల్లీ మధ్య నడిచే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలును జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కూటమి నాయకుల సహకారంతో న్యూఢిల్లీకి వెళ్ళే ప్రయాణికులు కోసం రాజంపేటలో సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేసేలా చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రైలు నిలుపుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రాజంపేట ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నివేదికలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 35 వార్డుల పంచాయతీ సెక్రటరీలతో మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వార్డు అభివృద్ధి కోసం ఎంత మొత్తంలో నిధులు అవసరమవుతాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి సచివాలయంల కార్యాదర్శులు ఉదయం 7 గంటలకే తమ తమ పరిధిలోని వీధులలో ఉండి ప్రజాసమస్యలు తెలుసుకోవాలని, అప్పుడే వీధులలో ప్రజలు తెల్పుతారని తెలిపారు. ప్రజాసమస్యలు గుర్తించి కమిషనర్ దృష్టికి తెచ్చి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. 2019 నుండి 2024 వరకు మదనపల్లి పట్టణంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, సున్నా అభివృద్ధి మాత్రమే జరిగిందని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే తదుపరి చర్యల కోసం సమగ్ర నివేదికను తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ప్రమీల, సచివాలయ కార్యాదర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఎనలేని అభివృద్ధి : మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలోనే అన్నమయ్య జిల్లాలో ఊహించని విధంగా ఎనలేని అభివృద్ధి జరిగిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి జిల్లా వ్యాప్తంగా రూ.143.81 కోట్లతో పూర్తయిన 1377 పనుల ప్రారంభోత్సవం, రూ.81.53 కోట్లతో 255 నూతన పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ఎవరు కనివిని ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో గ్రామాలలో సిమెంట్ రోడ్లు వేయాలంటే అప్పటి పాలకులు ఎన్నో ఇబ్బందులు పడే వారిని, కేవలం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రతి గ్రామంలో రూ. 15 లక్షల పైచిలుకు నిధులు ఖర్చు చేసి సిమెంటు రోడ్డు వేయించామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన ప్రతి చోటా ఆర్ అండ్ బి రోడ్లు వేసి రహదారుల రూపు రేఖలు మార్చామని తెలిపారు. గతంలో ఇసుకకు సంబంధించి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని చెప్పారు. శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ పనులు పూర్తి చేసేందుకు ఒకటి రెండు నెలలలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం జరిగిందని ఈ ప్రాజెక్టును పునర్నిర్మాణం చేసి రాజంపేట నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చిత్తూరు అన్నమయ్య, కడప జిల్లాలోని ప్రజలు చాలామంది మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని వీరందరికీ మామిడి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, ఆర్అండ్‌బి ఎస్ఇ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ల మణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ అన్నారు. బుధవారం బోయినపల్లి మార్కెట్ యార్డ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్, ప్రభుత్వం జోక్యం చేసుకొని గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో ప్రయివేటు మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు 200 దాకా ఉన్నాయన్నారు. వారందరూ సిండికేటై ధరల సగానికి సగం తగ్గించారన్నారు. వారం క్రితం చిత్తూరు కలెక్టర్ యాజమానులు, రైతు సంఘాలతో చర్చలు జరిపి తోతాపూరి కిలో రూ.12 ధర నిర్ణయించారని, ఆ ధర అమలు జరగడం లేదన్నారు. పులిహోర మామిడికాయలు టన్ను రూ.5 వేలుతో కొనుగోలు చేస్తున్నారని, గతంలో రూ.15 వేలు ఉండేదన్నారు. తోతాపురి కాయలు టన్ను రూ.6 వేలకు కొనుగోలు చేస్తున్నారని, గతంలో రూ.20 కొనుగోలు చేశారన్నారు. కిలో రూమాని, బెనీషా రూ.పది ఉందన్నారు. గతంలో రూ.30పైన ఉండేదన్నారు. నాటు రూ.4 లు, కొనుగోలు చేస్తున్నారన్నారు. నీలం ఫ్యాక్టరీ ధర బట్టే వ్యాపారస్తులు బయట మార్కెట్ రెండు, నాలుగు రూపాయలు ఎక్కువ పెడతారన్నారు. ఈ ఏడాది మామిడి కాపు తక్కువ ఉందన్నారు. ధర పెరగాల్సి ఉండగా దళారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు ధర పెట్టడం లేదన్నారు. ట్రాక్టర్ దుక్కులు, కూలీల ఖర్చులు, ఎరువులు, మందులు, రైతు వాడే ట్రాక్టర్ స్పేర్ ధరలు పెరగడం, జిఎస్‌టి వేయడం, రైతులకు భారమైందన్నారు. తవ్వకం కూలీలు ఖర్చు, కోత కూలీలు, రోజు కూలీలు ఒకరికి రూ.500 ఉందన్నారు. సరుకు రవాణా, లోడ్, అన్‌లోడ్ చేసినందుకు మామిడి రైతు పెట్టిన పెట్టుబడి రావడంలేదని పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుకు గిట్టుబాటు ధర, సబ్సిడీ కల్పించి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. మామిడి, బొప్పాయి, అరటి, ఇతర రైతుల సమస్యలపై చర్చించి న్యాయం చేయాలన్నారు. కోడూరులో మూసివేసిన అప్పుజ్యూస్ ఫ్యాక్టరీ తెరిపించాలని, నందలూరులో మూసివేసిన ఆల్విన్ పరిశ్రమ స్థానంలో ఒక భారీ పండ్ల జ్యూస్ పరిశ్రమ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరిప్రసాద్, బొజ్జ శివయ్య, వివిధ గ్రామాల మామిడి రైతులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయక్ అన్నారు. బుధ వారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకొని ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష జరపాలని కోరారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలని అలవాటు పడిన నేరస్తులను ఛార్జ్‌షీట్ తెరచి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు జరిపి గంజాయిని అరికట్టాలని సూచించారు. జిల్లాలో జూదం ఎక్కడ కూడా జరగకుండా కట్టిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యక్ర మాలు నిర్వహించే వారి కదలికలపై నిఘా ఉంచాలని చైన్స్ స్నాచింగ్ పై నిఘా ఉంచాలని సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతను ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశిం చారు. విజిబుల్ పోలీస్‌లో భాగంగా గ్రామాలు పట్టణాలలోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసు పై ప్రత్యేక దృష్టిసారించి అత్యధిక ప్రాధాన్యతతో ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యులను చేరేంతవరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి పాల్గొన్నారు.

సన్నబియ్యం బస్తాను చూపుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కాబోతున్న నేపథ్యంలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు కృషి చేయలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని వారు పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ బాలల ఆటల దినోత్సవం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయచోటి పట్టణంలోని మార్కెట్ స్ట్రీట్‌లో మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల ఆటల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయచోటి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి, సిడిపిఒ సుగుణ , రాయచోటి సెక్టర్ సూపర్వైజర్ సుగుణ, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ సమీవుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ మాట్లాడుతూ పిల్లలలో ఆటల ద్వారా శారీరక అభివృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. ఆటల పాటల ద్వారా పిల్లలకు విద్య సులభతరంగా నేర్చుకుంటారని పేర్కొన్నారు. సమీవుల్లా మాట్లాడుతూ మోడల్ ఫౌండేషన్ స్కూల్ ద్వారా మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల పిల్లలలో భాష అభివృద్ధి సంఖ్య జ్ఞానం, చదవడం రాయడం, సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా మోడల్ ఫౌండేషన్ స్కూల్ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి దేవస్థానం, ఆలయ కమిటీ సాకారంతో పిల్లలకు దాదాపు 100 మందికి పలకలు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు పరుగు పందెం , మ్యూజికల్ చైర్స్, ఇండోర్ గేమ్స్ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ టీచర్ సురేందర్‌రెడ్డి, ప్రథమ్ జిల్లా సమన్వయకర్త రాజశేఖర్, సూపర్వైజర్ శివ సుబ్బమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఓబులమ్మ, ముకులు, అరుణ, మజహార, తల్లిదండ్రులు, పాల్గొన్నారు

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చిప్పిలిలో బుధవారం ఘనంగా పాలేటి గంగమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి డీలు, బోనాలు మోసి మొక్కులు చెల్లిం చుకున్నారు. వైసిపి నేత మల్లికార్జునరెడ్డి ఆహ్వానం మేరకు.. మదనపల్లె వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్, పలువురు నాయకులు హాజరయ్యారు. అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న. గ్రామదేవత పాలేటి గంగమ్మ జాతరను గ్రామస్థులు ఐక్యంగా అంగరంగ వైభవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పకార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మహేష్, ఈశ్వర్‌నాయక్, శారదారెడ్డి, నాగమని, వినీత పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-వీరబల్లి

అన్నదానం గొప్పదని రాష్ట్ర ఎంపిపిల సంఘం అధ్యక్షుడు రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వీరబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు రాజేంద్ర నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 పంచాయతీల నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షల కోసం, వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు సొంత నిధులతో గత మూడు సంవత్సరాల నుంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ రాజకీయ కోణాలతో చూడకుండా, మానవతా దృక్పథంతో చూడాలన్నారు. గర్భిణులు ఇబ్బందులు పడకూడదు అనే ఉద్దేశంతో వారికి సేవ చేయడం కోసం ముందుకొచ్చామని అన్నారు. ఎవరైనా మానవతా దృక్పథంతో చూసే దాతలు ముందుకొచ్చి గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనీషా, డాక్టర్ బిందు, గర్భిణీ మహిళలు, బాలింతలు, పాల్గొన్నారు.

గడప గడపకూ చెత్త సేకరణ

ప్రజాశక్తి-కలకడ

గడపగడపలో చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర తెలిపారు. మండల కేంద్రమైన కలకడ బాలయ్యగారిపల్లి పంచాయతీలలో గడప గడపకు చెత్త సేకరణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ వేరువేరు చేసే విధంగా చెత్త కుండీల స్టాండులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి క్లాప్ మిత్రులకు గ్లౌజులు, దుస్తులు అందించినట్లు పేర్కొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు, మాజీ సింగల్ విండో చైర్మన్ ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ గ్రామ ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలో చెత్త వేయకుండా చెత్తకుండీలలోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు జావూద్‌అలీఖాన్, పారిజాన్, కె.విశ్వనాథ్ నాయుడు, కలికిరి మార్కెట్ యాడ్ కమిటీ మెంబర్ ముబారక్‌అలీ, గ్రామపం చాయతీ కార్యదర్శి దేవేంద్ర, కలకడ టిడిపి నాయకులు ఎల్లమంద జిలానిబాషా, జాఫర్ హుస్సేన్, ఇర్ఫాన్‌బాషా, ఖాజాహుస్సేన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని ఎంపిపి డి.నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాలలో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని సూచించారు. మండలం లోని సుమారు 15 శాఖల సంబంధించిన అధికారులతో గడిచిన మూడు నెలలో చేసిన అభివృద్ధి, అభివృద్ధికి వెచ్చించిన నిధులపై సమీక్షించారు. పారిశుద్ధ్యం, తాగునీటి వంటి వాటికి అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ప్రతిరోజు ప్రతి ఇంటి వద్ద పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపరచాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. మండలంలోని బండ్లపై, రాచవేటివారిపల్లె, తవళం, కొమ్మిరెడ్డిగారిపల్లెలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా మార్పు చేయడం చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, విద్యా సామాగ్రి కిట్లను అందిస్తున్నారన్నారు. మండలంలో కొత్తగా సుమారు 5 కోట్ల నిధులు వెచ్చించి సిసి రోడ్లు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. తాగునీటి కోసం కొత్తగా 8 బోర్లను వేసినట్లు తెలిపారు. కొన్ని గ్రామాలలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, కుక్కలను బంధించి సురక్షిత ప్రాంతంలో వదలాలని కోరారు. ఆర్టీసి బస్సులలో ప్రయాణించే సమయంలో 60 ఏళ్ల నిండిన వారికి బస్సు ఛార్జీలో 25 శాతం రాయితీ ఆర్టీసి అధికారులు కల్పిస్తున్నారని, వయోవృద్ధులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ప్రధానమంత్రి సూర్యగర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారని, ఆసక్తి కలిగిన వారు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పడడంతో, మద్యం ప్రియులు పాడుతోందని బెల్టు షాపులను నియంత్రించాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని శాఖాధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, సుజాత, ఎంపిటిసిలు, సర్పంచులు, ఎఒ రమేష్‌బాబు, సిడిపిఒ నాగజేని, ఎపిఒ రమేష్, అటవీ శాఖ అధికారి శోభారాణి, ఎఇలు ఉమర్ఫారూఖ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతి ధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : 'ముక్కా'

సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న రూపానందరెడ్డి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమని కుడా చైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శెట్టిగుంట గ్రామంలో రూ.50లక్షల నిధులతో సిసి రోడ్డుకు భూమిపూజ చేసి పనుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఈ క్రమంలో శెట్టిగుంట గ్రామం నుంచి గణేష్‌గాట్ వరకు రూ.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి పథంలోకి రావాలని తెలిపారు.కూటమి ప్రభుత్వం రోడ్డు, డ్రెయినేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సదుపాయం అందించడమే కాక గ్రామ అభివృద్ధికి కూడా ఎంతో తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ బాలనరసింహులు, కూటమి నేతలు డిసిఎంఎస్ చైర్మన్ వై.జయప్రకాష్, నీలకంఠయ్య, గడికోట సుబ్బరాయుడు, రామరాజు, కొమ్మ శివ, తిరుపతి శేఖర్, డి.గోపాల్, సుబ్బి రామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుకుమార్‌రెడ్డి కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టిబి ముక్త్ భారత్ అభియాన్ విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-కలికిరి

టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను విజయవంతం చేద్దా మని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్యగంధ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి. పర్య వేక్షకులు నాగిరెడ్డి, భయ్యారెడ్డి గ్రామంలో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన ప్రజలకు సర్పంచ్ రెడ్డిరామ్ ఆధ్వర్యంలో టిబి వ్యాధిపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు టిబి ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగతాగు వారిని, మద్యం సేవించు వారిని, గతంలో టిబి వ్యాధి వచ్చి నయమైన వారిని, హెచ్ఐవి పాజిటివ్ వారిని, బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారిని, గర్భిణులు, షుగర్ ఉన్న వారిని, దీర్ఘాకాలిక జబ్బులు ఉన్న వారిని గుర్తించి వారికి గళ్ళ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాజిటివ్ వచ్చిన యెడల ఆరు నెలల చికిత్స ఉచితంగా ప్రారంభించి, చికిత్స సమయం లో రోగి ఖాతాలో రూ.1000లు చేయడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవాజ్, సిహెచ్ఒ షాహిదాబాను, ఆశాకార్యకర్తలు మంజుల, సుమలత, ఖాదర్‌బీ పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజ్యాధికారమే అణగారిన వర్గాల లక్ష్యం కావాలని ఎంఎస్‌పి జిల్లా ఇన్‌చార్జి కోట డానియల్ పేర్కొన్నారు. బుధవారం ఎంఎస్‌పి సీనియర్ నాయకులు వెలగచర్ల శివయ్య ఆధ్వర్యంలో డిబిఎన్ పల్లెలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎంఎస్‌పి మండల కమిటీ అధ్యక్షులుగా కోటకొండ శ్రీహరి (వడ్డెర), బత్తల కృష్ణయ్య, (వడ్డెర), ప్రధాన కార్యదర్శిగా నల్లబోతుల శ్రీనివాసరావు(బోయ), కార్యదర్శిగా కోటకొండ వెంకటేశ్వర్లు (వడ్డెర), గౌరవ అధ్యక్షులుగా మేకల వెంకటేశ్వర్లు(ఎరుకల), ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులుగా బాలిపోగుసుబ్బయ్య (మాదిగ), ఉపాధ్యక్షులుగా కుంభగిరి ఈశ్వరయ్య(మాదిగ), ప్రధాన కార్యదర్శి వెలగచర్ల నరసింహారావు (మాదిగ), కార్యదర్శిగా మాత నారాయణరావు (మాదిగ), ప్రచార కార్యదర్శి కత్తి శ్రీనివాసరావు (మాదిగ), కోశాధికారిగా కత్తి కొండయ్య (మాదిగ), గౌరవ అధ్యక్షులుగా అందే బాలాజీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోట డానియల్ మాట్లాడుతూ నైపుణ్యం గల నిమ్న వర్గాల వారిని నైపుణ్యం లేని వారు పాలిస్తున్నారని, జోళ్లు కుట్టడం దగ్గర నుంచి డప్పు వాయించడం, కుండలు తయారు చేయడం వంటి తదితర నైపుణ్యాలు కలిగిన నిమ్న వర్గాలకు రాజ్యాధికారం రావాలంటే మహాజన సోషలిస్టు పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య వడ్డెర, ఎంఆర్‌పిఎస్ నాయకులు చేమూరి వెంకటేష్, మందా శివయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ సాయిబాబారెడ్డి తెలిపారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో కడప రిమ్స్ వారి సహకారంతో ప్రిన్సిపల్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ బృందం వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రాన్స్ ఫ్యూజన్ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎండీ డాక్టర్ సంధ్య, కడప రిమ్స్ రక్తదాన శిబిరం ప్రత్యేక అధికారి శుభశ్రీ పాల్గొని రక్తదానం చేయడం వలన కలిగే ఫలితాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ప్రదీప్ కుమార్, ఫార్మసీ విభాగం హెచ్ ఒడి డాక్టర్ గిరిరాజశేఖర్, ఎం.ప్రమోద్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వ రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు సేవ కేంద్రంలో సబ్సిడ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్‌కు నారాయణి రకం764 క్వింటాళ్లు మండలానికి మంజూరు అయినట్లు పేర్కొన్నారు. 30 కేజీల బస్తా ధర రూ.2850 కాగా ప్రభుత్వం సబ్సిడీ రూ.1140 ఇస్తుందని, రైతు వాటా కింద రూ.1710 చెల్లించాలని తెలిపారు. వేరుశెన విత్తనాలు పొందుతున్నారు గ్రామ రైతు సేవ కేంద్రంలో పొందవచ్చు అన్నారు అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వై నాగమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎ.కవిత, ఎల్.ప్రభంజని స్థానిక టిడిపి నాయకులు ప్రతాప్‌రెడ్డి, అంజనారెడ్డి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **కలికిరి:** ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి పేర్కొన్నారు. కలికిరి, పత్తేగడ రైతు సేవా కేంద్రాలలో ఆమె రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను వ్యవసాయ అధికారి మమతారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నావుల్లా, నాయకులు మల్‌రెడ్డి, దినకర్, వెంకటనారాయణ రెడ్డి, సహదేవరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **వీరబల్లి:** రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు వ్యవసాయ శాఖ అధికారి స్వాతి ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు బానుగోపాల్‌రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ రైతు సేవ కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీని చేపట్టారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుఇఇయు నాయకులు

యుఇఇయు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కనుపర్తి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సిజపుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక సబ్ స్టేషన్‌లో మహాసభల నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను యూనియన్ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14,15వ తేదీలలో గుంటూరులో ఈ మహాసభలు నిర్వహిస్తున్నారని ఈ మహాసభల్లో విద్యుత్ ప్రయివేటీకరణకు పెరుగుతున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, డిఎ బకాయిలు, కారుణ్య నియామకాలు, ఇపిఎఫ్, జిపిఎఫ్, మెడికల్ పాలసీ తదితర సమస్యలపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వి సుబ్రహ్మణ్యం,నాయకులు వి రమేష్ కుమార్,ఈశ్వర్ రావు కృష్ణారెడ్డి,మణి,రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువు కాలనీలో తాగునీటి సమస్యపై ప్రజలు తమ దృష్టికి తేవడంతో వెంటనే బోరు వేయించి పైపులను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తం గా మారుమూల గ్రామాల సైతం తాగునీటి సమస్య లేకుండా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. అనంతరం కాలనీలోని ఇటీవల మృతి చెందిన చీకటి రామప్ప నాయు డు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుం టామని హామీనిచ్చారు.వారి పిల్లలు ప్రయివేట్ పాఠశాలలో చదువుకుంటున్నారని తెలుసుకొని వారి విద్యకు కావలసిన ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు, హరినాథ్, అజీమ్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల బీమా అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం లబ్ధిదారులు మృతుడి భార్య తుమ్మలూరు రెడ్డమ్మ కు రూ.2లక్షల చెక్కును అందించినట్లు ఎపిజిబి మేనేజర్ కె.మనోహర్ అందించారు. ఇటీవల మండల పరిధిలో యెర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన తుమ్మలూరు రెడ్డయ్య మృతి చెందారు. ఆయన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం సంవత్సరానికి రూ.436 చెల్లించి ఖాతాదారు కావడంతో ఆ మొత్తం రూ.2 లక్షలు ఆయన భార్యకు అందజేశారు. కష్ట కాలంలో ఉన్న తన కుటుంబమును బ్యాంకు మేనేజర్ మనోహర్ కృషితో పిఎంజెజె బీమా యోజన పథకం ఆదుకోవడంతో కుటుంబ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేసి బ్యాంకు మేనేజర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న ఖాతాదారులు అందరూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం దేరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది అశోక్, శశికుమార్ బ్రహ్మానందరెడ్డి, నవీన్, మణి పాల్గొన్నారు.

కలకడ తహాశీల్దార్‌గా మహేశ్వరీబాయి

ప్రజాశక్తి-కలకడ

తహాశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్‌గా ఎస్. మహేశ్వరీబాయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలికిరి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కలకడ మండలానికి తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. గతంలో కలకడ తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన ఫణి కుమార్ పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమ స్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. రైతులకు భూము లపై ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. విద్యార్థులకు ఇతరులకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు పత్రాలను సకాలంలో అందించి వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. సిబ్బంది అన్ని విధాల తనకు సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మూడు నెలల అనంతరం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వన్నూరుసాబు గుట్టకు చెందిన సలావుద్దీన్(63) వారపుసంతలో కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతను ఫిబ్రవరి 22వ తేదీన సంతకు వెళ్లి అక్కడ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు సునీల్ వృద్ధుడుని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సలావుద్దీన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని ద్విచక్ర వాహదారుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :ఆటో ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కురబలకోట మండలం, దిగువ బోయపల్లెకు చెందిన రెడ్డప్ప తమ చెల్లెలు సుమలత కుమార్తె సింధూను వెంటబెట్టుకొని ద్విచక్ర వాహ నంలో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని చౌడేశ్వరి కళ్యాణ మండపం వద్ద వెనుక నుంచి వచ్చిన ఆటో ద్విచక్ర వాహనాన్ని అధిగమించే క్రమంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో సింధు స్వల్పంగా గాయపడగా, రెడ్డప్పకు చెవుల్లోనూ ముక్కులోనూ రక్తం రావడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికులు బాధితున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి -కలకడ : కిడ్నాప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని గుర్రంకొండ రోడ్డులో నివాసమున్న సైదిలీ తన చెల్లెలు గత నాలుగు సంవత్సరాల క్రితం రాయచోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం చేసినట్టు తెలిపారు. పెళ్లయిన అనంతరం రూ.10 లక్షలతో ఖాజా, సైదల్లిలు కలసి వ్యాపారాలు చేసినట్లు తెలిపారు. ఇటీవల సైదిలీ మృతి చెందడంతో ఆర్థిక లావా దేవీల కోసం ఇచ్చిన రూ.10 లక్షలు ఇవ్వకపోవడంతో ఖాజా తరచూ వారి కుటుంబ సభ్య లతో ఘర్షణలు పడే వారిని తెలిపారు. సైదిలీ తమ్ముడు జాఫర్‌వల్లి కువైట్ నుంచి ఇండి యాకు రావడంతో అతడిని డబ్బులు అడగడంతో, తనకున్న ఇంటిని అమ్మి అప్పు తీరు స్తానని తెలిపాడని చెప్పారు. విసుకు చెందిన ఖాజా సైదిలీ కుమారుడు అనిఫ్‌అలీని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. అనీఫ్‌అలీ తల్లి ఎలమంద షేక్ కౌసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖాజాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

CHANGE OF NAME

I Sibyala Rathnamma (old name) D/o Venkatesu R/o 6/72, Kondlopalli, Utukur, Rajampet Mandal, Annamaiah Dt.

I have changed my name to Sibyala Venkata Rathnamma D/o Sibyala Venkatesu (New name)

CHANGE OF NAME

I Shaik Firdoz (old name) W/o Shaik sardhar basha R/o 4/49, Isukuapalli, Madanagopalapuram, Rajampet Mandal, Annamaiah Dt.

I have changed my name to Shaik Firdhose W/o Shaik sardar basha (New name)

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: LAKKIREDDYPALLI
O.S.No. 132/2023

G. Kullayappa. ...Plaintiffs

Vs

Lepakshi Reddy BashaS/o Imamsab, Niranjan Nagar, Borugula Factory, Industrial Estate, Kadapa Dist. ...Defendants

SUMMONS ORDER-5 RULE-1, 5 C.P.C.

WHERE AS the plaintiff has instituted a suit against you for the plaint mentioned relief vide plaint copy attached herewith, you are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 25-06-2025 at 10.30 o' clock in the forenoon answer the claim and your are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. TAKE notice that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

//By order of the court//

V.AZMATHULLAH, B.A., B.L.
Advocate for Plaintiff,
MASAPETA, RAYCHOTY.
Cell: 99636 12791.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: RAYACHOTY
O.S.No. 14/20

Syed Reddy Gafoor. ...Plaintiffs

Vs

Shaik RameejaW/o Shaik Ahammed, 2/968-1, Maruthi NagarKadapa Dist. ...Defendants

SUMMONS ORDER-5 RULE-1, 5 C.P.C.

WHEREAS the plaintiff has instituted a suit against you for the plaint mentioned relief vide plaint copy attached herewith, you are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 16-06-2025 at 10.30 o' clock in the forenoon answer the claim and your are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. TAKE notice that, in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

//By order of the court//

V.AZMATHULLAH, B.A., B.L.
Advocate for Plaintiff,
MASAPETA, RAYCHOTY.
Cell: 99636 12791.

ఏరువాక పౌర్ణమి ప్రారంభం

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలంలోని గ్యారంపల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమిని వర్షాకాలం మొదలయ్యేటప్పుడు రైతులు నాగలిని పూజించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. 'ఏరు' అంటే నాగలి అని, 'ఏరువాక' అంటే దుక్కి ప్రారంభం అని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఎడిఎ రమణారావు, గ్యారంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కె.వి పల్లి మండలం ఎఒ శ్రావణి,రమేష్, కె వికె శాస్త్రవేత్తలు, డిఆర్‌సి హార్టికల్చర్, వెటర్నరీ శాస్త్రవేత్తలు, మౌనిక, మంగిరి బాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాధితుడికి చేయూత

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబుళవారిపల్లి మండలం ఎస్‌టి కాలనీకి చెందిన మునెయ్య అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురైకుడి చెయ్యి, కాలి వేలు తొలగించారు. విషయం తెలుసుకున్న సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా మహిళా విభాగం వైస్ చైర్మన్, పుల్లంపేట టిడిపి మహిళా నాయకులు సి.ఎస్.సౌభాగ్య వెంటనే స్పందించి జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మునెయ్య కుటుంబానికి అండగా నిలిచి వారి జీవనానికి కావాల్సిన నిత్యా వసరాలు అందించారు. ఈ సందర్భంగా సౌభాగ్య మాట్లాడుతూ తమ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ మానవతా సేవా భావంతో ఎంతోమందికి పలు రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఆదర్శంగా తీసు కొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. అభాగ్యులకు సేవ చేసుందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో వృద్ధురాలికి మంటలు అంటు కుని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధి తురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా, ఎన్‌పికుంట మండలం, పి.కొత్తపల్లికి చెందిన వెంకటేష్ మంగమ్మదంపతులు బ్రతుకు తెరువు కోసం 15ఏళ్ల కిందట మదనపల్లెకు వచ్చారు. స్థానిక అమ్మచెరువు మిట్టలో కాపురం ఉంటూ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఐదేళ్ల క్రితం వెంకటేష్ చనిపోగా, మంగమ్మ తన కుమార్తె వెంకటలక్ష్మి వద్ద ఉంటోంది. అమ్మచెరువు మిట్టలో గంగ జాతర జరుగుతున్న కారణంగా కుమార్తె, మనవడు గుడి వద్దకు వెళ్లడంతో మంగమ్మ ఇంట్లో ఒంటరి ఉందని తెలిపారు. ఈ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంగమ్మకు మంటలు అంటు కోవడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే స్థానిక జిల్లా ఆసు పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. రెండవ పట్టణ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

రామాపురం : వాతావరణ మార్పులపై అధ్యయనం చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హిస్తున్న ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రతినిధుల బృందం మండలంలోని ఎంపిడిఒ సభావనంలో సమావేశం నిర్వహించారు. పర్యటన బృందం ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ బాలాజీ త్రిపాఠి, ప్రోగ్రాం అసోసియేట్ కృష్ణమూర్తి, సౌమ్య ప్రకృతి వ్యవ సాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పాల్గొని మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ పరిస్థితులపై చర్చించారు. స్వయం సహాయక సంఘాల పనితీరు, తీసు కున్న రుణాలు ఎలా ఉపయోగించుకుంటున్నారో అనే అంశాలపై రైతు లతో చర్చించారు. ప్రకృతి వ్యవసాయంతో పంట దిగుబడి పెరుగుతందని, ఖర్చులు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్స్ మధుకర్, వెంకటరామిరెడ్డి, సుధాకర్, కదురున్నీసా, రైతులు పాల్గొన్నారు.